కంచ గచ్చిబౌలి చెట్ల నరికివేతపై సుప్రీం ఆదేశాలు హర్షణీయం

కాచిగూడ: కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం పట్ల ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య హర్షం వ్యక్తం చేశారు. 'పర్యావరణం తరఫున మాట్లాడేవారు ఎవరూ లేరనే ధైర్యంతో.. ఎవరేమి మాట్లాడినా మేము పట్టించుకోం'అనే రీతిలో నిరంతరం పర్యావరణ విధ్వంసాలకు పాల్పడే వారికి కోర్టు హెచ్చరిక చెంపపెట్టులాంటిదని అన్నారు. కంచ గచ్చిబౌలిలో తక్షణమే చెట్లు నాటి పూర్వ స్థితిని నెలకొల్పకుంటే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు అనేక మంది అధికారులు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు హెచ్చరించడం శుభపరిణామమని అన్నారు. ప్రభుత్వాలకు కేవలం అభివృద్ధి మాత్రమే ఉండకూడదని.. తరతరాలు సుభిక్షంగా ఉండాలంటే పర్యావరణ పరిరక్షణతోనే సాధ్యమనే ధ్యాస ఉండాలని ఆయన సూచించారు.

చిక్కడపల్లిలో ఎమ్మెల్యే పూజలు



వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితులు ఆయన తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ అన్నపూర్ణ, యువజన నాయకులు ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా స్నాతకోత్సవం

డా. పీవీ నందకుమార్‌రెడ్డి



నల్లకుంట: దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ బీఎస్సీ నర్సింగ్ స్నాతకోత్సవం పండగలా జరిగింది. విద్యార్థులు పట్టాలు పుచ్చుకొని ఫ్యాకల్టీ, తల్లిదండ్రులతో ఫొటోలు దిగి ఆనందంలో మునిగితేలారు. శుక్రవారం నల్లకుంటలోని డీడీహెచ్‌ఆర్‌సీ ఆడిటోరియంలో జరిగిన స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ పీవీ నందకుమార్‌రెడ్డి మాట్లాడారు. చదువుకున్న జ్ఞానం, నైపుణ్యం, మానవీయ విలువలు ఉపయోగించి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రొ డా. విద్యావతి మాట్లాడుతూ.. నర్సింగ్ వృత్తిలో నిరంతర అధ్యయనం అవసరమన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: అర్హులైన ప్రతి ఒక్కరి ప్రభుత్వ పథకాలు అందేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సీఎంఆర్‌ఎఫ్ కింద 28 మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.10.32 లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. పేదలకు వ్యక్తిగతంగా అండగా ఉండేందుకు కృషి చేస్తానన్నారు.

మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య

చిక్కడపల్లి: యువకుడు మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం చత్రినాకకు చెందిన శివరామకృష్ణ(28) డీజేలో పనిచేస్తాడు. గురువారం నాగమయ్యకుంటలో ఉండే బావ మహేష్ ఇంటికి వచ్చాడు. అదే రోజు రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివరామకృష్ణ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బావ మహేష్ పని ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చి తలుపు కొట్టినా తీయకపోడంతో గడ్డపారతో తలుపు తీసి తెరచి చూడగా నిర్జీవంగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా యువకుడు వివాహేతర సంబంధం కొనసాగడంతో చత్రినాక పోలీసులు ఇరువురికి కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. శివరామకృష్ణ గురువారం మధ్యాహ్నం బావ మహేష్ ఇంటికి వచ్చాడు. అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ వివాహితకు పెళ్లి కాక ముందు నుంచి శివరామకృష్ణతో ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. శివ రామకృష్ణ మనస్థాపంతోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

డెంగీని తేలిగ్గా తీసుకోవద్దు


జాతీయ డెంగీ నివారణ దినోత్సవ సందర్భంగా అవగాహన ర్యాలీలు



బర్కత్‌పురలో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఉమారమేష్ యాదవ్



నెహ్రూనగర్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి డా.మౌనిక



కాచిగూడ: డెంగీని తేలిగ్గా తీసుకోవద్దని... వ్యాధిని గుర్తించకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని కాచిగూడ కార్పొరేటర్ ఉమారమేష్ యాదవ్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో శుక్రవారం బర్కత్‌పురలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఏడీస్ దోమల ద్వారా డెంగీ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స చేయకపోతే ప్రాణాంతకమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవటంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అదే విధంగా ఫ్రై డేను డ్రై డేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరేందర్, శేషు, నారాయణ, రాజశేఖర్ రెడ్డి, బసవరాజు, బీజేపీ నేతలు బలీర్, శేర్‌సాగర్, సుభాష్ పటేల్, అరవింద్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, సూరి, ఎస్.రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్ ఎంటమాలజీ ఆధ్వర్యంలో..

◆ జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం గోల్నాక డివిజన్ నెహ్రూనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒకరోజు తప్పనిసరిగా డెంగీ నివారణ కోసం సిబ్బందితో దోమల మందు పిచికారి చేయించాలని కోరారు. డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

◆ తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులు, కండరాల నొప్పి, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిస్తే అజాగ్రత్త చేయకుండా వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. డెంగీ వ్యాధికి నివారణ మార్గాలే రక్షణ చర్యలని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న కేసుల్లో వైరల్ ఫీవర్స్ అధికంగా ఉన్నాయని తెలిపారు. వైరల్ జ్వరాలను కూడా డెంగీగా భావించి ప్రజలు ఆందోళన చెందొద్దని అన్నారు. ప్రతి జ్వరం డెంగీ కాదన్నారు.

◆ తల్లిదండ్రులు వైరల్ ఫీవర్లపై కనీస అవగాహన ఉంటే పిల్లలు జ్వరాల బారిన పడకుండా చూసుకోవచ్చని పేర్కొన్నారు. జ్వరం వచ్చినప్పటికీ వారికి ఉన్న అవగాహనే మందుగా పనిచేస్తుందని అన్నారు. ఫీవర్ ఆస్పత్రి గోవర్ధన్‌రెడ్డి, డీహెచ్‌ఎం విమల, ఈఎఫ్‌ఏ పి.వెంకటయ్య, బొడ్డుపల్లి కిషన్, పాతురు కళ్యాణ్‌బాబు, పి.అశోక్, ఇబ్రహీం, ఉపేందర్, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలుగు రాష్ట్రాలోని కళాకారులను ఆయా ప్రభుత్వాలు ఆదుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ జానపద కళాకారుల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ జానపద పరిశోధకులు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, జేఏసీ కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ.. తక్షణమే సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో సమావేశం ఏర్పాటు చేసి కళాకారుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జేఏసీ నాయకులు మురళీధర్ దేశ్‌పాండే అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంబటి సురేంద్రరాజు, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయ, ప్రముఖ రచయిత విమల, దర్శకుడు చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్ నిలయం వద్ద ఫ్లాగ్‌మార్చ్



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణమధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ నేతృత్వంలో శుక్రవారం 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని అభినందిస్తూ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయం నుంచి సంగీత్ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ ప్రదర్శనలో సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ అండ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయనాథ్ కోట్ల, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్ ఎ.కె.రావత్, డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్.ఆర్. షెల్కేలతో పాటు ఇతర అధికారులు, రైల్వే సిబ్బంది, దక్షిణ మధ్య రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ వాలంటీర్లు,ఆర్పీఎఫ్ పాల్గొన్నారు.ఆపరేషన్ సింధూర్ విజయంపైన ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఉగ్రవాదాన్ని అణచివేయడంలో భారత సాయుధ దళాలు ప్రదర్శించిన వ్యూహాత్మక శక్తి, పరాక్రమానికి సంఘీభావాన్ని తెలియజేసేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ప్రత్యేక సదుపాయాలు



గ్రంథాలయంలో చదివి ఉద్యోగం సాధించిన అభిషేక్‌కుమార్‌ను సన్మానిస్తున్న చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

చిక్కడపల్లి: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు గ్రంథాలయాల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. గన్‌ఫౌండ్రీలోని శాఖా గ్రంథాలయంలో చదివి ఇరిగేషన్ శాఖలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించిన అభిషేక్‌కుమార్‌ను శుక్రవారం చిక్కడపల్లి గ్రంథాలయంలో ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి పి.పద్మజ, ఇన్‌చార్జి లైబ్రేరియన్ సూర్యప్రకాశ్, సిబ్బంది మహేందర్, వెంకటేశ్‌యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్, మహేష్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన మెట్రో చార్జీలను ఉపసంహరించుకోవాలి

హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎల్‌అండ్‌టీ సంస్థ పెంచిన హైదరాబాద్ మెట్రోరైలు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. శ్రీనివాసరావు, వీరయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నష్టాలు వస్తున్నాయనే సాకుతో 20 నుంచి 42 శాతం వరకు చార్జీలు పెంచడం సరైనది కాదన్నారు. దీని వల్ల సామాన్యులపై తీవ్ర భారం పడుతుందని అన్నారు. ఎల్‌అండ్‌టీ సంస్థ చేసుకున్న ఒప్పందంలో 50శాతం టికెట్ చార్జీలు, మరో 50 శాతం రియల్ ఎస్టేట్ ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలి. కానీ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించి టికెట్ చార్జీలు పెంచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రైలు కోచ్‌లను పెంచకుండా రియల్ ఎస్టేట్ ద్వారా ఆదాయం సమకూర్చుకోకుండా తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుంటూ ప్రజలపై భారాన్ని మోపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో ఎలాంటి హెడ్ నిర్మాణం చేయకుండా పార్కింగ్‌ని ఏర్పాటు చేసి ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని పెంచిన చార్జీలను వెంటనే తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తిరంగా యాత్రను విజయవంతం చేద్దాం

అంబర్‌పేట: బీజేపీ ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న 'మేము సైతం.. దేశం కోసం.!'చేపట్టే తిరంగా యాత్రను విజయవంతం చేయాలని సెంట్రల్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు కోరారు. అందులో భాగంగా శుక్రవారం ఓయూ గేట్ వద్ద తిరంగా యాత్రలో భాగస్వాములు కావాలంటూ కరపత్రలను అందజేశారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం సాయంత్రం 5గంటలకు తిరంగా యాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, అడప చంద్రమౌళి, నాగరాజు చారి, చుక్క జగన్, సురేష్, కెంచె చంద్రశేఖర్, అంజనేయులు, రామిరెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఓయూ గేట్ వద్ద ర్యాలీ విజయవంతం చేయాలంటూ కరపత్రాలను అందజేస్తున్న బీజేపీ నేతలు

విద్యాసంస్థలు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ముషీరాబాద్: విద్యాసంస్థలు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని శ్రీనివాస ప్లే గ్రౌండ్‌లో గాంధీనగర్ కార్పొరేటర్ పావని, నీవి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అండర్-14 క్రికెట్ టోర్నమెంట్ 2025 పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... మన రాష్ట్రంలో ప్లేగ్రౌండ్‌ల కొరత తీవ్రంగా ఉందన్నారు. బస్తీలు, కాలనీలలో ఉన్న ప్లే గ్రౌండ్‌లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొంత మంది ప్లే గ్రౌండ్‌లను పార్కులుగా మార్చుతున్నారని దీనివల్ల పిల్లలు ఆడుకోవడానికి ఓపెన్ గ్రౌండ్‌లు కరువవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

ప్రభుత్వ స్థలాలను అమ్మవద్దు...

ప్రభుత్వ బహిరంగ స్థలాలను ప్రభుత్వం అమ్మేందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. వాటిని ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. ఓపెన్ గ్రౌండ్‌లుగా, క్రీడా మైదానాలు, పార్కులుగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలను పచ్చదనంగా మార్చుతూ భావితరాలకు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నీవి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, కార్పొరేటర్ రచనశ్రీ, మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, నాయకులు రమేష్‌రాం, నవీన్‌కుమార్, నాయకులు రత్నసాయి చంద్, శివాజీ, శ్రీకాంత్, దామోదర్, ఉమేష్, వీఎస్‌టీ రాజు, శ్రీనివాస్, మహమూద్ పాల్గొన్నారు.



అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులతోకేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, వినయ్‌కుమార్

ప్రతిభకు వయసు అడ్డంకి కాదు

చిక్కడపల్లి: ప్రతిభకు వయసు అడ్డంకి కాదని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. సాంస్కృతిక సంస్థ ది గంటీస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ గాయకుడు వైఎస్ రామకృష్ణకు జరిగిన అభినందన సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. నాలుగున్నర దశబ్దాలకు పైగా వివిధ వేదికలపై గానం చేస్తూ రామకృష్ణ తెలుగు వారి ఆదరాభిమానాలను చూరగొన్నారన్నారు. ప్రముఖులు రాజగోపాల్‌రావు, నిరంజన్, వంశీ రామరాజు, కిన్నెర రఘురాం, లలితారావు, ఓంకార్‌రాజు, దైవజ్ఞశర్మ, గంటి రామకృష్ణ పాల్గొన్నారు.



విక్రమ్‌రావు మృతి జర్నలిస్టుల ఉద్యమానికి తీరనిలోటు



చిక్కడపల్లి: సీనియర్ పాత్రికేయుడు కె.విక్రమ్‌రావు అకాలమరణం జర్నలిస్టుల ఉద్యమానికి తీరనిలోటని పలువురు వక్తలు అన్నారు. ఎఫ్‌డబ్ల్యూజే, టీడబ్ల్యూజేఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయ గానసభలో విక్రమ్‌రావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సురేందర్, సోమయ్య, ఆనందం, గౌరీశంకర్, పిల్లి రాంచందర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు యూపీహెచ్‌సీలో రక్తపోటుపై అవగాహన సదస్సు

ముషీరాబాద్: ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో రక్తపోటుపై అవగాహన సదస్సు, వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డా. మనోజ్ శుక్రవారం తెలిపారు. రక్తపోటు లక్షణాలు ఉన్న వ్యక్తికి అధికంగా తలనొప్పి, దృష్టి సమస్య, ముక్కు నుంచి రక్తం కారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, నీరసం, మూత్రపిండాల పనితీరు క్షీణించడం తదితర లక్షణాలతో బాధపడుతారని పేర్కొన్నారు. తెలిపారు. ఈ లక్షణాలు ఉన్న వారు సకాలంలో వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందితే రక్తపోటును తగ్గించవచ్చునని అన్నారు. యూపీహెచ్‌సీలో నిర్వహించే అవగాహన సదస్సు, వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం ... గుర్తుతెలియని వ్యక్తి (35) ఉప్పుగూడ - యాకుత్‌పురా రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

'మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసు'లను పరిష్కరించాలి



బాధితుల ధర్నాలో మాట్లాడుతున్న విమలక్క

కవాడిగూడ: సింగరేణి మారు పేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని శుక్రవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో అరుణోదయ సాంస్కృతిక సమైక్య వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడారు. 15 సంవత్సరాలుగా బాధితుల సమస్యలు పరిష్కరించకపోవడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారన్నారు. ఇప్పుడు వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి సకాలంలో సింగరేణి ఉద్యోగాలు రాక... ఎలాంటి ఉపాధి మార్గం లేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డిపెండింగ్ ఉద్యోగులు 1200 మంది దరఖాస్తు చేసుకోగా కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఈ సమస్యపై మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుకు విన్నవించినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేసి ఉద్యోగాలు కల్పించాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఇట్లుంటే ఎట్ల పోతరు.?

- సుందరయ్య పార్కు ఎదుట నిత్యం ట్రాఫిక్ జామ్
- రాకపోకలు సాగించే వారికి తప్పని తిప్పలు
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోని ట్రాఫిక్ పోలీసులు





అక్రమ పార్కింగ్‌తో సుందరయ్య పార్కు ముందు ట్రాఫిక్‌తో ఇక్కట్లకు గురవుతున్న వాహనదారులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన సుందరయ్య పార్కు ముందు ఉన్న రోడ్డు ఇరువైపుల అక్రమణకు గురికావడంతో పాటు అక్రమ పార్కింగ్ వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. సాయంత్రం 5 గంటలైంది అంటే చాలు అక్కడి నుంచి పోవాలంటే ఒక విధంగా సాహసం చేయాల్సిందే ఇక మహిళల విషయంలో చెప్పనక్కర్లేదు. వందలాది మంది చాయ్ కోట్లు, చాట్ బండారులు, బజ్జీల సెంటర్ల వద్ద మోహరించడంతో అక్కడి నుంచి మహిళలు పోవాలంటే జంకుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో అక్రమణలు, అక్రమణ పార్కింగ్‌ల వలనే అన్ని సమస్యలు ఉద్భవిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

◆ మూడు నెలల క్రితం ఆపరేషన్ రోప్ పేరిట జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు అక్రమ డబ్బాలను తొలగించినప్పటికీ మళ్లీ వెలిశాయి. ఈదారి గుండా కార్లు, ఆటోలు పోవాలంటే తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. టూవీలర్ మీద పోతూ హారన్ కొట్టారంటే వాహనదారులపై బెదిరింపులకు గురి చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసమే నిర్వహించిన ఆపరేషన్ రోప్ నిరుపయోగంగా మారిందనే విమర్శలు ఉన్నాయి.

ట్రాఫిక్ నియంత్రణకై ర్యాంపులు ఏర్పాటు చేయాలి...

◆ సుందరయ్య పార్కు ఎదుట పాదచారులకు ఏర్పాటు చేసిన ట్రాక్‌ను ర్యాంపులుగా ఏర్పాటు చేస్తే అక్కడ టూవీలర్స్‌ను పార్కింగ్ చేయడానికి అవకాశం ఉంటుంది. అసలే పది ఫీట్ల రోడ్డు ఇరువైపుల పార్కింగ్ చేయటం వల్ల పార్కింగ్ సమస్య తీవ్రతరం అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది..



ఇక్కడ నుంచి పోవాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంటుంది. మా ఇల్లు సుందరయ్య పార్కు సమీపంలో ఉండటంతో పాలు, పండ్లు, కూరగాయల కోసం వెళ్తే ఒక్కొక్కసారి ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సి వస్తుంది. ట్రాఫిక్ రద్దీ వలన అప్పుడప్పుడు చిన్నచిన్న గొడవలు జరుగుతూనే ఉన్నాయి. పెద్ద గొడవలకు దారి తీయకుండా ట్రాఫిక్ నియంత్రించాలి.

– శంకర్ గంగపుత్ర, స్థానికుడు

అధికారులు స్పందించాలి..



జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు తదితర అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకై తగిన చర్యలు తీసుకోవాలి. మూడు నెలల క్రితం సంబంధిత అధికారులు వచ్చి దుకాణాలను తొలగించారు. అయినప్పటికీ మళ్లీ వెలిశాయి. దీంతో సాయంత్రమైతే చాలు పోవాలంటేనే ఇబ్బందిగా మారింది.

– వెంకట్‌రామిరెడ్డి, వాకర్